క్లుప్తంగా

గణితంపై భయం వీడాలి



గణిత శాస్త్రంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయురాలు శ్రీదేవి

తెర్లాం: గణితంపై ఉన్న భయం వీడాలని, చక్కగా అర్థం చేసుకుంటే అత్యంత సులభమైన సబ్జెక్ట్ గణితం అని తెర్లాం మ్యాథ్స్ టీచర్ పి.శ్రీదేవి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గణిత శాస్త్రంపై సోమవారం అవగాహన కల్పించారు. సులువైన పద్ధతిలో లెక్కలు ఎలా చేయాలని, గణిత సూత్రాలను ఎలా గుర్తుంచుకోవాలన్న విషయాలను ఆమె తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

నేడు 'జగనన్న సంతకానికి నాలుగేళ్లు'

రాజాం: వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'జగనన్న సంతకానికి నాలుగేళ్లు' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు పార్టీ జోనల్ ఇన్‌చార్జ్ కంబాల సందీప్ తెలిపారు. ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ ఉంటుందన్నారు. అనంతరం పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో చేపట్టే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అందరూ ఉత్తీర్ణత సాధించాలి

తెర్లాం: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయుడు అప్పయ్య కోరారు. మండలంలోని లోచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫెయిలైన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన సోమవారం సందర్శించి, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. జూన్ 2వ తేదీ నుంచి జరిగే పరీక్షలకు ధైర్యంగా వెళ్లాలని, అంతవరకు బాగా చదువుకుని, పరీక్షలు బాగా రాయాలని తెలిపారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవం

బాడంగి: మండలంలోని పాల్తేరు గ్రామంలో సీతారామాలయ ప్రతిష్ఠోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, గోపూజ, పంచగవ్య ప్రాసన, దీక్షాధారణ, యాగశాల, అఖండ దీపారాధన, మండపారాధన, ప్రత్యేకార్చనలు, అగ్నిప్రతిష్ఠ, జలాధివాసం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పలనాయుడు, ఎంపీటీసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



కిశోరబాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

రేగిడి: కిశోరబాలికల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తప్పనిసరి అని 104 వాహన ఎంఎల్‌హెచ్ యశోద, హెచ్‌వీ సుభాషిణి అన్నారు. గుళ్లపాడు, కేఎంవలస అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం కిశోరబాలికల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేసుకోవద్దని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వి.జయలక్ష్మి, ఏఎన్ఎం రత్నం, ఆశా కార్యకర్తలు ప్రేమలత, శారద తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

సంతకవిటి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి అన్నారు. కార్యక్రమంలో ఏఓ పి.నవీన్, పీఆర్ జేఈ రియాజ్, ఈఓపీఆర్డీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద చేపడుతున్న ఉపాధి పనులను ఏపీఓ ఎస్.హరనాథరావు సోమవారం పరిశీలించారు. వేతనదారుల మస్టర్లు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా కాలువలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్‌లు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఏఈ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం రోడ్డు, మాధవ బజార్ ప్రాంతాల్లో విద్యుత్ బ్రేకర్స్ కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ అజెండా

- ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం: గాయత్రీకాలనీలో లబ్ధిదారునికి కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: అన్ని వర్గాల అభివృద్ధే ప్రధాన అజెండాగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణంలోని తిమ్మయ్యపేట, గాయత్రీకాలనీలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వార్డు సచివాలయం ద్వారా పంపిణీ చేసిన సంక్షేమ పథకాల బుక్‌లెట్లు లబ్ధిదారులకు అందించారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీయడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. గతంలో టీడీపీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని, కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరవేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఈ పథకాలన్నీ ఎగిరిపోతాయని, చంద్రబాబు మోసానికి బలికావొద్దని పిలుపునిచ్చారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక ఓట్లు మెజార్టీతో గెలిపించాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ కంబాల సందీప్, రాజాం పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, పార్టీ నాయకులు కలమట శంకర్, అల్లాడ శ్రీను, జి.కృష్ణ, చెక్కా రాజేష్, గణేష్, బొల్లా లలితకుమారి, కోల్ల రమ్య, శాసపు వేణుగోపాలనాయుడు, గొర్లె బ్రదర్స్, మున్సిపల్ కార్యాలయ మేనేజర్ నాగరాజు, వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మతి భ్రమించింది

- పేదల అభివృద్ధిపై ఎగతాళి చేస్తున్నారు
- ఇళ్ల స్థలాలపై అవహేళన చేయడం తగదు
- ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం-కంచరాం రోడ్డులో వైఎస్సార్‌సీపీ శ్రేణుల బైకల ర్యాలీ



రాజాం అంబేడ్కర్ జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

రాజాం: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు మతి భ్రమించిందని, అధికార దాహంతో ఉన్నారని ఎమ్మెల్యే కంబాల జోగులు విమర్శించారు. పేదల ఇళ్ల స్థలాలపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం రాజాం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జీఎంఆర్ఐటీ గేటు నుంచి అంబేడ్కర్ జంక్షన్ మీదుగా కంచరాం వరకు, అక్కడి నుంచి పైడితల్లి అమ్మవారి గుడిమీదుగా వైఎస్సార్‌సీపీ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అంబేడ్కర్ కూడలి వద్ద చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా నాలుగేళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. ప్రతీ పేదవాడి సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తే వాటిని శ్మశానాలతో పోల్చడం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తగదన్నారు. 14 ఏళ్లు అధికారంలో ఉండి ఒక్క పేదవానికి కూడా ఇంటి పట్టా ఇవ్వని బాబు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఇళ్ల స్థలాలు సమాధులు కట్టుకోవడానికి పనికొస్తాయని అవహేళన చేయడం ఆయన విజ్ఞతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ కంబాల సందీప్, రాజాం పట్టణ, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, పొట్నూరు లక్ష్మణరావు, వంగర మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, జేసీఎస్ కన్వీనర్ కామోదులు శ్రీరంగంనాయుడు, గెడ్డాపు అప్పలనాయుడు, ఆసపు సూర్యం, పట్టుశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ బొల్లా లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు భీమవరంలో గడప గడపకు..

బాడంగి: మండలంలోని భీమవరం గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఆరంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొంటారని, పార్టీ నేతలు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల సంబరం



సంబరాల్లో ముస్లిం సోదరులు

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి, నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా స్థానిక ముస్లిం వీధిలో కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిండు నూరేళ్ల చల్లగా ఉండాలని, పార్టీ అధికారంలో కొనసాగాలని నేతలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీకి తరలిరండి

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి, నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక పట్టణంలో మంగళవారం చేపట్టబోయే బైక్ ర్యాలీకి తరలి రావాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అధికారులు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 9 గంటలకు ఆరంభమయ్యే ఈ ర్యాలీలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొంటారని, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరు కావాలని కోరారు.

కనీస వేతనం చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకుడు శ్రీనివాసరావు

రామభద్రపురం: పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ నేత బలస శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై, స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రమామణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.10 చొప్పున వేతనం ఇవ్వాలని ప్రభుత్వం జీవో విడుదల చేసిందని, అయితే అధికారులు దానిని అమలు చేయడం లేదని తెలిపారు. ప్రతినెలా 5వ తేదీన కార్మికులు వేతనాలు వేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మిక సంఘం సభ్యులు కె.భవాని, కె.శ్యామల, కె.కనకరాజు పాల్గొన్నారు.

రంగరాయపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నం సచివాలయ పరిధి రంగరాయపురంలో సోమవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య గ్రామంలోని పలువురు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సీజన్‌లో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. నెలలో రెండు సార్లు గ్రామానికి వచ్చి వైద్య సేవలందించనున్నట్లు చెప్పారు.

చిన్నశిర్లాంలో వైఎస్సార్ క్లినిక్ ప్రారంభం



చిన్నశిర్లాంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ, తదితరులు

రేగిడి: మండలంలో చిన్నశిర్లాం గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ క్లినిక్ భవనాన్ని వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసిందన్నారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఆరోగ్య సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బూరాడ పీహెచ్‌సీ వైద్యాధికారి వి.రీనాచౌదరి, సర్పంచ్‌లు టంకాల ఉమాపాపినాయుడు, లెంక రాంబాబు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస రామచంద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులు

రాజాం: పట్టణంలోని చాకలివీధి, గాయత్రీకాలనీ, ఇందిరమ్మకాలనీ తదితర ప్రాంతాల్లో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పబ్లిక్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ పనులను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఇళ్లలోని వ్యర్థాలను కాలువల్లో వేయొద్దని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

రేగిడి: ప్రకృతి వ్యవసాయంతో సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చనని వ్యవసాయ అధికారి జి.మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ సీహెచ్.శారద అన్నారు. మండలంలోని సోమరాజుపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ విధానంలో సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. సర్పంచ్ ఎస్.రమేష్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో ఎరువులు

రేగిడి: మండలంలోని రైతుభరోసా కేంద్రాల ద్వారా యూరియాను పంపిణీ చేస్తున్నామని వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కోడిశ, ఆమదాలవలస, ఉనుకూరు, అంబకండి, దేవుదళ, ఖండ్యాం, సంకిలి, మునకలవలస, సోమరాజుపేట, ఉంగరాడ గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. మునకలవలస ఆర్‌బీకే వద్ద సర్పంచ్ చంద్రశేఖర్ రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. రైతులు తమ ఆధార్ కార్డు, పట్టదారు పాసుపుస్తకాల వివరాలతో ఎరువులు పొందవచ్చన్నారు.

సకాలంలో జేవీకే కిట్ల పంపిణీ

వంగర: మండలంలోని అన్ని పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్లు సకాలంలో చేరేటట్లు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ వై.దుర్గారావు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన జేవీకే కిట్ల స్టాక్ పాయింట్‌ను సోమవారం పరిశీలించారు. మండలంలోని 47 పాఠశాలలకు ఈ కిట్లు అందజేయనున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం



కుక్క దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్షున్నాయుడు



గాయపడిన బాలుడు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస, రాజాం ప్రాంతాల్లో వీధి కుక్కలు సోమవారం జరిపిన దాడిలో పలువురు గాయపడ్డారు. పొనుగుటివలస గ్రామానికి చెందిన శాసపు లక్షున్నాయుడు ఉదయం రోడ్డుపై నడుస్తుండగా కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. ఇతనితో పాటు మరో ముగ్గురు మీసాల అన్నపూర్ణమ్మ, జె.సరస్వతమ్మ, గేదెల బంగారమ్మలు కూడా కుక్కల దాడిలో గాయాల పాలయ్యారు. వెంటనే గ్రామస్తులు అప్రమత్తమై కుక్కను వెంటాడి హతమార్చారు. రాజాం చాకలివీధికి చెందిన ఏడేళ్ల బాలుడు నవకుమార్ వీధిలో ఆడుకుంటుండగా కుక్కలు ఒక్కసారిగా దాడిచేసి గాయపర్చాయి. పాలకొండ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న రాధాకృష్ణను గాయపర్చాయి. వీరంతా స్థానికుల సహాయంతో రాజాం సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కుక్కల దాడిలో గాయపడిన వారిలో లక్షున్నాయుడు పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. విచ్చలవిడిగా కుక్కలు స్వైర విహారం చేసి గాయపర్చడంతో ప్రజలు భయాందోళనకు గురతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల నివారణా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం

రాజాం: పట్టణంలో కొత్తవలస యూపీ స్కూల్‌లో రెండో విడత 'నాడు-నేడు' పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రూ.10 లక్షలు ఈ పనులు నిమిత్తం మంజూరు కాగా, ప్రస్తుతం అదనపు మరుగుదొడ్లు నిర్మాణం చేపడుతున్నట్లు హెచ్ఎం కుదమ తిరుమలరావు సోమవారం తెలిపారు. రెండో విడతలో భాగంగా మూడు తరగతి గదులకు గ్రానైట్ ఫ్లోరింగ్ పనులు చేశామని వివరించారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూ

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్ పోస్టులకు సోమవారం ఇంటర్వ్యూ నిర్వహించారు. అరసాడ గ్రామంలో ఇటీవల ఖాళీ అయిన రెండు వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు. ఎంపికైన వారికి ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు, డీటీ బూరాడ సుందరరావు, ఈఓపీఆర్డీ ఎల్.త్రినాథ్ నియామక పత్రాలు అందజేశారు.

రవాణా, హమాలీ చార్జీలు చెల్లించాలి

బొబ్బిలి: ఖరీఫ్ ధాన్యం తరలించేందుకు రవాణా, హమాలీల చార్జీలు చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం, సీపీఎం జిల్లా నేత పి.శంకరరావు కోరారు. ఇదే విషయమై స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నందిగాం గ్రామంలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజల బాగోగుల లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అనేక పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించిన ఆయన గడిచిన నాలుగేళ్లలో 98.5 శాతం హామీలను నెరవేర్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్నన్ని పథకాలు మరే రాష్ట్రంలో లేవన్నారు. ప్రస్తుతం అమలులోని పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు వెల్లివిరుస్తున్నాయన్నారు. టీడీపీ మరోసారి మేనిఫెస్టోతో ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైందని, అయితే టీడీపీ హామీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి, తెర్లాం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎన్.బాబ్జీరావు, మండల వైస్ ఎంపీపీ సీహెచ్ సత్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు టి.సత్యంనాయుడు, జి.మృత్యుంజయరావు, సర్పంచ్ ఎ.గంగా గౌరీశంకరరావు, ఎంపీటీసీ ఎ.గౌరీ లక్ష్మణరావు, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల విజేత 'మరడాం'

- రన్నర్‌గా నిలిచిన తమ్మయ్యవలస జట్టు
- మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన గరివిడి జట్లు



మరడాం జట్టుకు నగదు బహుమతి, షీల్డ్‌ను అందజేస్తున్న ఎస్ఐ రమేష్

తెర్లాం: మండలంలోని తమ్మయ్యవలస గ్రామంలో మూడు రోజులుగా జరిగిన ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో విజయనగరం జిల్లా మరడాం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ దివంగత బొత్స కిశోర్ జ్ఞాపకార్థం గ్రామానికి చెందిన యువత ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో భాగంగా ఆదివారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరిగిన ఫైనల్ పోటీల్లో మరడాం జట్టు విన్నర్‌గాను, తమ్మయ్యవలస జట్టు రన్నర్‌గాను, మూడు, నాలుగు స్థానాలను గరిడివికి చెందిన జట్లు సాధించాయి. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన మరడాం జట్టుకు రూ.15వేలు, ద్వితీయ స్థానం సాధించిన తమ్మయ్యవలస జట్టుకు రూ.10వేలు, మూడు, నాలుగు స్థానాలు సాధించిన గరివిడి జట్లకు రూ.6వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతిని తెర్లాం ఎస్ఐ ఆర్.రమేష్, మండల వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, రంగప్పవలస సర్పంచ్ శనపతి రాంబాబు అందజేశారు. టోర్నమెంట్‌లో బెస్ట్ అఫెన్సర్‌గా ఆదిత్య, బెస్ట్ స్పైకర్‌గా బాబీ ఎంపికయ్యారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం'



తెర్లాం: వినతులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ



రామభద్రపురం: సూచనలిస్తున్న ఎంపీడీఓ రమామణి

తెర్లాం: ప్రజాసమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి, పలువురి నుంచి వినతులు స్వీకరించి, పరిశీలించారు. గ్రామంలోని అంబేడ్కర్ భవనం దగ్గరున్న రచ్చబండ స్థలాన్ని కొంత మంది ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని, దానిని అడ్డుకోవాలిన కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు వినతిపత్రంలో ఎంపీడీఓను కోరారు. స్పందించిన ఎంపీడీఓ సంబంధిత అధికారులను అక్కడికి పంపించి, చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే వినతుల్లో పలువురు పేర్కొన్న సమస్యలను పరిష్కరించాలని, సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాంబాబు, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఎంపీడీఓ రమామణి పాల్గొని, పలువురు సమర్పించిన వినతిపత్రాలను స్వీకరించి, పరిశీలించారు. అనంతరం ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు.

బాడంగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పలువురు సమర్పించిన వినతులను ఎంపీడీఓ కె.అక్కారావు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సత్యం, ఏపీఎం భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో సోమవారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఉత్తమ గ్రామ, వార్డు సచివాలయాల వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలతో సత్కరించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు వలంటీర్ల సేవలను ప్రశంసించారు. వలంటీర్లు సంక్షేమ వారధులని, నిస్వార్థ సేవలందించే వారికి ఏ రంగంలోనైనా మంచి గుర్తింపు ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే తరహాలో వలంటీర్లను సన్మానిస్తుండడం చాలా గొప్ప విషయమన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుముందు కూడా పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: పక్కి గ్రామంలో సన్మాన గ్రహీతలతో ఎంపీపీ లక్ష్మీవేణుగోపాలనాయుడు



సంతకవిటి: జీఎన్‌పురంలో వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న సర్పంచ్ పప్పల ఈశ్వరరావు